# అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటా..

**• మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ • బీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించిన అపార్ట్‌మెంట్ వాసులు**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



యోగా సాధకులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి తలసాని

బేగంపేట్ అక్టోబర్ 15: అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటానని, కాలనీల్లో ఇప్పటికే అనేక అభివృద్ధి చేపట్టినట్లు మంత్రి, సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఆదివారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పీజీ రోడ్డులోని అపార్ట్‌మెంట్ వాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని, ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. గతంలో పీజీ రోడ్డు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేదని, తన హయాంలో రూ. 20 కోట్లతో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. పనిచేసే నాయకులను ఆదరించాలని కాలనీ వాసులకు సూచించారు. అప్పుడే మరిన్ని అభివృద్ధి పనులు జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో అపార్ట్‌మెంట్ సెక్రటరీ ఉమేశ్ అగర్వాల్, శరత్ మంజని, వినయ్, ప్రవీణ్, గోపాల్, ధరమ్‌పాల్, అగర్వాల్, రోచా మీనాచౌదరి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

**యోగా సాధన జీవితంలో భాగం కావాలి : మంత్రి తలసాని**

అమీర్‌పేట్, అక్టోబర్ 15 : మెరుగైన ఆరోగ్యానికి యోగా సాధన జీవితంలో భాగం కావాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. యోగా సాధన కేంద్రం 19వ వార్షికోత్సవాన్ని ఆదివారం సనత్‌నగర్‌లోని కేఎల్‌ఎన్ పార్కు యోగా హాలులో నిర్వహించారు. మంత్రి తలసాని ముఖ్యఅతిథిగా విచ్చేసి యోగా సాధకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సనత్‌నగర్ కేఎల్‌ఎన్ పార్కులో యోగా హాలు నిర్మించి, ఆవరణలో వాకింగ్ పాత్, ఓపెన్ ఎయిర్ జిమ్, చిన్న పిల్లలకు ఆట పరికరాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్కును మరింత ఆహ్లాదంగా తీర్చిదిద్దుతానన్నారు. యోగా హాల్ నిర్మించిన మంత్రి తలసానికి సాధకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి, యోగా సాధన కేంద్ర నిర్వాహకులు నరేంద్ర బంధు, యోగా గురువులు కృష్ణ, అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, షాబాద్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ధైర్యం ఇచ్చిన బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో

**• నియోజకవర్గ వ్యాప్తంగా పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్న పార్టీ నాయకులు**




హమాలిబస్తీలో సంబురాలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ప్యారడైజ్ చౌరస్తాలో బాణసంచా కాలుస్తున్న రాంగోపాల్‌పేట్ బీఆర్‌ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్/బేగంపేట్, అక్టోబర్ 15 : సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో నిరుపేదలు, రైతులు, మహిళలకు కొండంత ధైర్యం ఇచ్చిందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు పేర్కొన్నారు. పద్మారావునగర్‌లోని హమాలిబస్తీలో ఆదివారం మ్యానిఫెస్టో ప్రకటన అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి, మిఠాయిలు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు దారులకు సన్నబియ్యం, ఆసరా ఫించన్లు పెంచడం, నగరంలో మరో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపట్టడం, కల్యాణలక్ష్మి సాయాన్ని పెంచడం, ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచడం, బీపీఎల్ కుటుంబానికి రూ. 5 లక్షల బీమా, రైతు బంధు సాయాన్ని పెంచడంతో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు ఏసూరి మహేశ్, డివిజన్ కార్యదర్శి ఎం.మహేందర్, శ్రీకాంత్ రెడ్డి, వెంకటరమణ, సురేశ్, దుర్గ,నాగలక్ష్మి, కౌసల్య, అంబిక, శ్రీనివాస్, మల్లేశ్, హరిచారి, సుధాకర్‌రెడ్డి,రజనీశ్, సదానంద్, ఎల్లయ్య, శివభార్గవ్ పాల్గొన్నారు.

**బేగంపేట్ పరిధిలో..**

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం తెలంగాణ భవన్‌లో సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు బీఫాం ఇవ్వడంతో పాటు ప్రజలకు మేలు చేసే విధంగా మ్యానిఫెస్టో విడుదల చేశారు. దాంతో హర్షం వ్యక్తం చేస్తూ రాంగోపాల్‌పేట్ బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ప్యారడైజ్ చౌరస్తాలో పటాకులు కాల్చి కార్యకర్తలు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టో పేదలకు మరింత మేలు విధంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఆరోగ్యశ్రీ చికిత్సను రూ. 15 లక్షలకు పెంచడం అభినందనీయం



కుటుంబంలో ఎవరికైనా చిన్న జబ్బు చేసి ప్రైవేట్ దవాఖానకు వెళితే అక్కడ వేలు ఖర్చు పెట్టందే వైద్యం దొరకని పరిస్థితి. అలాంటి సమయంలో సీఎం కేసీఆర్ బస్తీ దవాఖాలు ఏర్పాటు చేసి సామాన్యులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 15 లక్షల వరకు వైద్య చికిత్సకు ఖర్చు పెంచడం గొప్ప విషయం. దాంతో పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యానికి భద్రత లభించినట్లయింది.

**- యాదయ్య , బేగంపేట్**

### ఆడపడుచు పెండ్లికి ఆర్థిక సాయం పెంచడం హర్షణీయం



కల్యాణలక్ష్మి పథకం కింద పేదింటి ఆడపడుచు వివాహానికి ఇస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని రెండు లక్షలకు పెంచుతూ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ప్రకటించడం పట్ల సీఎం కేసీఆర్‌కు ధన్యవాదములు. అలాగే ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచడం, ప్రతి బిపిఎల్ కుటుంబానికి రూ.ఐదు లక్షల ఉచిత బీమా కల్పించడం హర్షణీయం. బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టో చాలా బాగుంది. అందరికి నచ్చింది.

**- ఎం.హరిచారి, పద్మారావునగర్**

### గ్యాస్ సిలిండర్ రూ. 400లకే అందిస్తామనడం సామాన్యులకు ఆసరా..



ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో సామాన్య మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఆసరాగా ఉన్నది. ప్రధానంగా ఇంట్లో వంట చేసేందుకే చిన్న కుటుంబానికి సిలిండర్‌కు నెలకు సుమారు వెయ్యి రూపాయలు ఖర్చవుతున్నది. అలాంటిది రూ. 4 వందలకే సిలిండర్ ఇస్తామని బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించడం ఆనందంగా ఉన్నది. అమలు చేస్తే మహిళామణులంతా కేసీఆర్‌కు మంగళహారతులు పడతారు.

**- సుమలత, గృహిణి, మోండామార్కెట్**

## బొడ్రాయి ప్రతిష్ఠాపనకు భూమి పూజ



హమాలిబస్తీలో బొడ్రాయి ఏర్పాటుకు భూమిపూజ చేసిన నాయకులు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 15 : పద్మారావునగర్‌లోని హమాలిబస్తీ ఫేజ్ 1, 2 వాసుల కోరిక మేరకు బొడ్రాయి ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఉదయం వేద పండితులు శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత, ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్ గౌడ్ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్తీవాసులకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్ని విధాలా అండగా ఉంటారని అన్నారు. ఈ నెల 25న మంత్రి తలసాని చేతుల మీదుగా బొడ్రాయి ప్రతిష్ఠాపన జరుగుతుందని తెలిపారు. హమాలిబస్తీ అధ్యక్షుడు సుభాశ్, యాదగిరి, కౌసల్య, దుర్గ, కుషాల్, శ్యామ్, అంజయ్య, నర్సింగ్, వెంకటేశ్, రాములు, కమ్మశ్రీను, రాజు, శివభార్గవ, సందీప్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు మహేశ్, సురేశ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

## వివిధ రూపాల్లో అమ్మవారు



దసరా నవరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తుండటంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలను సందర్శించారు. మొదటి రోజు బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారు శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణలో.. అమీర్‌పేట్ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు స్వర్ణకిరీటం ధరించి, అమీర్‌పేట్ హనుమాన్ ఆలయంలో కొలువుదీరిన దుర్గమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

–అమీర్‌పేట్, అక్టోబర్ 15

## జెక్‌కాలనీలో బతుకమ్మ వేడుకలు



సనత్‌నగర్ జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చింతిరెడ్డి ప్రభ, ఎస్.అన్నపూర్ణ ఆధ్వర్యంలో కాలనీ నార్త్ స్ట్రీట్‌లోని వనమాల రెసిడెన్సీ అయోధ్య మెడికల్ హాల్ ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

– అమీర్‌పేట్, అక్టోబర్ 15

## నిరాశ్రయులకు దుస్తులు పంపిణీ

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 15 : పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్ల వెంట ఉన్న వృద్ధులు, అభాగ్యులు, దివ్యాంగులకు ఆదివారం దుస్తులు, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. సభ్యులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో వ్యానులో తిరుగుతూ దుస్తులు, బిస్కెలు, తాగునీటి ప్యాకెట్లను అందజేశామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. ప్రతి నెలా రెండు, నాలుగు ఆదివారాల్లో అన్నదానం చేస్తున్నామని చెప్పారు.